గడ్డికాలనీ రహదారికి మోక్షమెన్నడో..?

అడుగడుగునా గోతులు.. తరచూ ప్రమాదాలు

ముంచంగిపుట్టు మండలం

సుత్తిగూడ రహదారి పరిస్థితి అంతే..

వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

-వార్త 8వ పేజీలో...



విప్లవ జ్యోతి అల్లూరి

తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన సీతారామరాజు

- స్వాతంత్ర్య ఉద్యమంలో రంప తిరుగుబాటు ఓ చరిత్ర
- రెండేళ్ల పాటు బ్రిటీష్ పాలకులకు కంటిమీద కునుకు కరువు
- ఆదివాసీలపై సైన్యం హింస భరించలేక మంపలో అల్లూరి లొంగుబాటు
- తుపాకీతో కాల్చి చంపిన మేజర్ గూడల్

చింతపల్లి, ఆగస్టు 14:

స్వాతంత్ర్య ఉద్యమంలో మన్యం వేదికగా అల్లూరి సీతారామరాజు సాగించిన రంప తిరుగుబాటు తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించింది. రెండేళ్ల పోరాటంలో బ్రిటీష్ పాలకులకు అల్లూరి సీతారామరాజు కంటిమీద కునుకులేకుండా చేశారు. 1922 నుంచి 1924 వరకు అల్లూరి సీతారామరాజు చేపట్టిన ఉద్యమం స్వాత్రంత్య పోరాటంలో ఓ చరిత్ర సృష్టించింది. ఈ ఉద్యమాన్ని మన్యం విప్లవం, రంప తిరుగుబాటుగా పిలుస్తారు. ఆదివాసీలను చైతన్యం చేసి సాయుధ పోరాటానికి నాంది పలికి, బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన అల్లూరి రంప తిరుగుబాటుపై స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



అల్లూరి సీతారామరాజు దాడిచేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంతోని మోగల్లు గ్రామానికి చెందిన అల్లూరి వెంకట రామరాజు, సూర్యనారాయణమ్మ దంపతుల తొలి సంతానంగా 1897 జూలై 4వ తేదీన విశాఖ జిల్లా పాండ్రంగి గ్రామంలో సీతారామరాజు జన్మించాడు. భీమవరం, రాజమండ్రి, రామచంద్రపురం, పిఠాపురం, విశాఖపట్నం, నరసాపురం తదితర ప్రాంతాల్లో విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. 15 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ పాలకుల తీరుపై రగిలిపోయేవాడు. ఈ క్రమంలో గిరిజనులపై బ్రిటీష్ పాలకుల దురాగతాలు పెరిగిపోయాయి. ఆదివాసీల జీవనాధారమైన పోడు వ్యవసాయం, తేనె, అటవీ ఉత్పత్తుల సేకరణను నిషేధించి, అటవీ వనరులను బ్రిటీష్ అధికారులు అన్యాయంగా దోచుకునేవారు. లంబసింగి ఘాట్ రోడ్డు నిర్మాణంలో చింతపల్లి తహసీల్దార్ బాస్టియన్.. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఆదివాసీలకు కూలి సక్రమంగా చెల్లించకపోగా ప్రశ్నించివారిని కొరడాలతో కొట్టించేవాడు. సీతారామరాజు దీనిపై బ్రిటీష్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకోని బ్రిటీష్ పాలకులు అల్లూరి సీతారామరాజుపై కేసు పెట్టారు. సీతారామరాజు ఏజెన్సీలో ఉంటూ బ్రిటీష్ పాలకుల దోపిడీని ఎదిరించాలని గిరిజనులను బోధిస్తున్నాడని, మన్యంలో ఉంటే తిరుగుబాటు తెస్తాడని భావించిన బ్రిటీష్ అధికారులు నర్సీపట్నం తీసుకు వెళ్లి గృహ నిర్బంధం చేశారు. అనంతరం అడ్డతీగల, పైడిపుట్టిలో కొన్నాళ్లు బ్రిటీష్ అధికారుల కనుసన్నల్లో ఉన్నాడు. పోలవరం డిప్యూటీ కలెక్టర్ ఫజులుల్లాఖాన్ సహకారంతో శిక్ష తప్పించుకుని మళ్లీ 1922 జూన్‌లో మన్యంలో అడుగుపెట్టాడు.



అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి సంతకం చేస్తున్న రామరాజు (ఊహా చిత్రం)

ఆదివాసీలను ఉద్యమకారులుగా తీర్చిదిద్ది..

బ్రిటీష్ పాలకుల అకృత్యాలు, దురాగతాలను జీర్ణించుకోలేని సీతారామరాజు ఆదివాసీలకు అండగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివాసీల హక్కులను వివరిస్తూ వారిలో ధైర్యాన్ని పెంపొందించాడు. గిరిజనులను సమీకరించి దురలవాట్లను దూరం చేస్తూ యుద్ధ విద్యలు, గెరిల్లా యుద్ధ పద్ధతులను నేర్పి పోరాటానికి సిద్ధం చేశాడు. అల్లూరి అనుచరుల్లో గాము గంటందొర, గాము మల్లుదొర, కంకిపాటి ఎండుపడాల్, గోకిరి ఎర్రేసు ముఖ్యులు. సాయుధ పోరాటానికి సన్నద్ధమైన సీతారామరాజు ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు సాయుధ పోరాటం సరైన మార్గమని నిర్ణయించుకుని 1922 ఆగస్టు 17న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి సిద్ధమయ్యాడు.



కృష్ణాదేవిపేటలో అల్లూరి సీతారామరాజు సమాధి

పోలీస్ స్టేషన్లపై వరుస దాడులు

సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టిన అల్లూరి సీతారామరాజు వరుసగా పోలీస్ స్టేషన్లపై దాడి చేశాడు. 1922 ఆగస్టు 22వ ... మిగతా 8వ పేజీలో

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పాడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా స్థాయిలో జరిగే ఈ వేడుకలకు స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల మైదానం వేదిక కానున్నది. ప్రత్యేక పోలీస్ పరేడ్ నిర్వహించేందుకు 50 మంది ఆర్మ్‌డ్ రిజర్వుడ్ కానిస్టేబుళ్లను మూడు రోజుల ముందే ఇక్కడికి రప్పించి సాధన చేయిస్తున్నారు. ఆయా ఏర్పాట్లను గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈఈ అనుదీప్, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, తదితరులు పర్యవేక్షిస్తున్నారు. సాంస్కృతిక ప్రదర్శనల కోసం సుమారు 15 పాఠశాలలకు చెందిన గిరిజన విద్యార్థులు వారం రోజులుగా సాధన చేస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

పాడేరులో గురువారం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 9.05కి పోలీస్ పరేడ్, గౌరవ వందనం స్వీకరణ, 9.15 గంటలకు కలెక్టర్ సందేశం, 9.35 గంటలకు విద్యార్థులతో దేశభక్తి, సాంస్కృతిక ప్రదర్శనలు, 10.05 గంటలకు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, 10.25 గంటలకు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాల పంపిణీ, 11 గంటలకు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్ల ప్రదర్శన, 11.30 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుంది.

కలెక్టర్‌కే జెండా ఆవిష్కరణ అవకాశం

పాడేరులో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్‌కు జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించేందుకు అవకాశం దక్కింది. ఎన్‌టీఆర్ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మిలిగిన జిల్లాల్లో రాష్ట్ర మంత్రులు మాత్రమే జాతీయ జెండాను ఆవిష్కరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రం ఆ అవకాశాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు కల్పించింది.

విద్యాలయాల్లో హెచ్ఎంలు..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలోని విద్యాలయాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులే స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ఈ నెల 8వ తేదీనే జరిగిపోయాయి. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ఇంకా జరగలేదు. అందు వల్ల ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో హెచ్ఎంలకు జెండా ఆవిష్కరించే అవకాశం దక్కింది.



పాడేరులో స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమైన వేదిక

ఘనంగా హర్ ఘర్ తిరంగా



భారీ జాతీయ జెండాతో పాడేరు అంబేడ్కర్ కూడలిలో విద్యార్థుల మానవహారం



జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జేసీ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, ఎస్పీ అమిత్‌బర్దార్, ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు

అంబేడ్కర్ కూడలిలో విద్యార్థుల మానవహారం

పాడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవ నేపథ్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బుధవారం పాడేరులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 400 మీటర్ల జాతీయ జెండాను పాడేరు మెయిన్ రోడ్డులో సుమారుగా మూడు కిలోమీటర్లు ఉత్సాహంగా ఊరేగించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, ఎస్పీ అమిత్ బర్ధార్, ఐటీడీఏ పీవో అభిషేక్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెయిన్‌రోడ్డులో ఊరేగింపు అనంతరం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయ జెండాతో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళి, గిరిజన సంక్షేమ విద్యా శాఖ ఉపసంచాలకుడు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలపై విచారణ

- క్వారీని సందర్శించిన రెవెన్యూ, అటవీ, పోలీసు అధికారులు
- కూలీలు, వ్యాపారులపై దర్యాప్తు
- తవ్వకాలు జరిపితే భూమి పట్టా రద్దు చేస్తామని యజమానికి హెచ్చరిక

చింతపల్లి, ఆగస్టు 14: మండలంలోని గొందిపాకలు పంచాయతీ సమ్మగిరి గ్రామంలో వారం రోజులుగా జరుగుతున్న రంగురాళ్ల తవ్వకాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'సమ్మగిరిలో రంగురాళ్ల' శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి రెవెన్యూ, అటవీశాఖ, పోలీసు అధికారులు స్పందించారు. సమ్మగిరి గ్రామంలో తవ్వకాలు నిర్వహిస్తున్న క్వారీని తహసీల్దార్ టి.రామకృష్ణ, పెదవలస రేంజ్ అధికారి కె.శివరంజని, పోలీసులు పరిశీలించారు. గ్రామంలో గిరిజనులతో క్వారీలో జరుగుతున్న తవ్వకాలపై ఆరా తీశారు. రాత్రివేళ గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు సాగిస్తున్నారని, పగటి పూట క్వారీని మూసివేస్తున్నారని సమ్మగిరి గిరిజనులు తెలిపారు.

దీంతో తహసీల్దార్, రేంజ్ అధికారి మాట్లాడుతూ గ్రామంలో రంగురాళ్ల తవ్వకాలు జరుగుతుంటే స్థానిక ప్రజలకు తెలియకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దీంతో తామంత వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నామని, రంగురాళ్ల తవ్వకాలు చేపట్టలేదని సమాధానం ఇచ్చారు. దీంతో తహసీల్దార్ భూమి యజమాని పొటుకూరి బాబూరావుని పిలిచి క్వారీలో తవ్వకాలు నిర్వహిస్తే ప్రభుత్వం జారీ చేసిన డీఫారం పట్టాను రద్దు చేస్తామని హెచ్చరించారు. క్వారీలో తవ్వకాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత భూమి యజమానిపై ఉంటుందన్నారు. భూ యజమాని సహకారం లేకుండా తవ్వకాలు జరిగే అవకాశం లేదన్నారు. అనంతరం గ్రామస్థుల సహకారంతో తవ్వకాలు సాగించిన క్వారీని రాళ్లతో మూయించివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, రేంజ్ అధికారి మాట్లాడుతూ క్వారీలో తవ్వకాలు జరగకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. క్వారీలో తవ్వకాలు జరిపిన కూలీలు, వ్యాపారులపై దర్యాప్తు ... మిగతా 8వ పేజీలో



సమ్మగిరి గిరిజనులతో మాట్లాడుతున్న రేంజ్ అధికారి శివరంజని



మూసివేసిన క్వారీ

160 కిలోల గంజాయి స్వాధీనం

ఇంట్లో నిల్వ చేసినట్టు సమాచారం రావడంతో పోలీసుల తనిఖీలు.. ముగ్గురి అరెస్టు

పెదబయలు, ఆగస్టు 14: పెదబయలు మండలం కొరవంగి పంచాయతీ వల్లంగిపుట్టు గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన 160 కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి జి.మాడుగుల సీఐ ఎస్.రమేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వల్లంగిపుట్టు గ్రామంలోని ఓ ఇంట్లో ఎండు గంజాయి నిల్వ ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు గ్రామానికి చెందిన గబ్బంగి గున్నయ్య ఇంట్లో తనిఖీలు చేశారు. బస్తాల్లో దాచిన 160 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో సంబంధం ఉన్న గబ్బంగి గున్నయ్య, గబ్బంగి బాలయ్యదొర, తిరుపతి రావులను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.



రావణాపల్లిలో నీట మునిగిన వరి పొలాలు

చెరువును తలపిస్తున్న పొలాలు

మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. అయితే ఆ తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయి రెండు గంటల సేపు భారీ వర్షం కురిసింది. వరి నాట్లు వేసిన పొలాలు పూర్తిగా నీటమునిగి చెరువును తలపిస్తున్నాయి. కొండవాగులు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

-కొయ్యూరు

ఎమ్మెల్సీగా బొత్స ఎన్నిక లాంఛనం



అధికారికంగా ప్రకటన రేపు

రేపు సాయంత్రం కోడ్ ఎత్తివేత

విశాఖపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సమక్షంలో నామినేషన్లు పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమానికి స్వతంత్ర్య అభ్యర్థి షేక్ షఫీ, వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ తరపున ఆయన ప్రతినిధులు హాజరయ్యారు. అన్ని పత్రాలు ఉండడంతో రెండు నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంది. అయితే స్వతంత్ర్య అభ్యర్థి షేక్ షఫీ తాను నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు బుధవారమే పత్రాలు దాఖలు చేశారు. దీంతో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే బరిలో ఉన్నట్టు అయ్యింది. అయినప్పటికీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాతే అధికారికంగా బొత్స సత్యనారాయణ ఎన్నికను ప్రకటిస్తారు. కాగా ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల తరువాత కోడ్ తొలగిపోనున్నది. ఈ విషయాన్ని రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ వెల్లడించారు. కాగా, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని కూటమి నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే.

గడ్డికాలనీ రహదారికి మోక్షమెన్నడో..?

ఎక్కడికక్కడ గతుకులతో ప్రమాదకరంగా రోడ్డు

పాడేరు రూరల్, ఆగస్టు 14: జిల్లా కేంద్రం పాడేరులోని గడ్డికాలనీ నుంచి ముల్లుమెట్ట వెళ్లే రహదారి ప్రమాదకరంగా తయారైంది. సినిమా హాలు జంక్షన్‌కు ఎదురుగా కొండపై ఉన్న ఈ కాలనీలోని ప్రజలు రహదారి, తాగునీరు సమస్యలుతో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు బాగా ఎత్తుగా ఉంది. అక్కడ గతుకుల మయంగా మారి మరింత ప్రమాదభరితంగా తయారైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు ప్రతీ రోజు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న పెద్ద కొండ నుంచి ఈ మార్గంలోకి ఊటనీరు నిత్యం రావడంతో రహదారి దెబ్బతిందని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఈ రహదారికి ఇనువైపులా కాలువలు లేకపోవడంతో కొండపై నుంచి వచ్చే ఊటనీరుతో పాటు ఎగువ ప్రాంత ప్రజల వాడకం నీరు రావడంతో అందరూ ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పంచాయతీ ప్రతినిధులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి మోక్షం కల్పించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.



రాళ్లు, పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారిన గడ్డికాలనీ రోడ్డు

సుత్తిగూడ మార్గం.. అధ్వానం

రహదారిపై పేరుకుపోయిన బురద

ముంచంగిపుట్టు, ఆగస్టు 14: లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని సుత్తిగూడ గ్రామంలో పక్కా రహదారి మట్టి మార్గాన్ని తలపిస్తున్నది. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు ఎర్రమట్టి కొట్టుకువచ్చి రహదారిపై ఉండిపోయింది. దీంతో పక్కా రహదారి మట్టి రోడ్డులా మారిపోయింది. దాని పర్యావసంగా అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు, పాదచారులు రహదారి పక్క నుంచి వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. రహదారిపై బురద పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు తరచూ ఆ ప్రదేశంలో ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు తెలిపారు. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో వర్షపు నీరు రహదారిపై నుంచి ప్రవహిస్తున్నదని, చిన్నపాటి చినుకు పడితే ఆ ప్రదేశం బురదమయంగా మారుతున్నదని ఆయన చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాల కులు స్పందించి ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహించే ప్రదేశాలను గుర్తించి డ్రైనేజీల నిర్మాణ పనులు జరిగేలా చూడాలని గిరిజనులు కోరతున్నారు.



సుత్తిగూడ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టి

మన్యంలో ఘనంగా హర్‌ఘర్ తిరంగా



అరకులో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

చింతపల్లి/అరకులోయ/కొయ్యూరు/సీలేరు, ఆగస్టు 14: మన్యంలోని పలు మండలాల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హర్ గర్ తిరంగాను పురస్కరించుకుని విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు ర్యాలీ చేశారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీలు చేపట్టారు. స్వాతంత్ర్య సమరయోధులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, అరకులోయ, కొయ్యూరుతో పాటు సీలేరులో ఈ కార్యక్రమం చేపట్టారు. మూడు మండలాల నాయకులు, అధికారులు విజయభారతి, జగత్‌రాయ్, జె.ప్రభాకరావు, కె.శ్రీనివాసరావు, బి.బాలయ్యపడాల్, ఎస్.బాలకృష్ణ, ఆర్.చంద్రరావు, ఎ.రాజు, దిలీప్‌కుమార్, లవకుశ, స్వామి, సీలేరు వైద్యాధికారి సౌమ్య, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శంకరరావు, ఎస్ఎస్ఎస్ పీవో డి.శ్రీను, పీఈటీ కమలాకర్, హెచ్ఎస్ త్రినాథ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంపై యూబీఐ ఫొటో ప్రదర్శన

పాడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాలపై స్థానిక యూనియన్ బ్యాంకు అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను బుధవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సంయుక్తంగా ప్రారంభించారు. అలాగే ప్రదర్శనను వారు ఆసక్తిగా తిలకించారు. ఫొటోలు, సందర్భాలను జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నాయుడు వివరించారు. ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు యూనియన్ బ్యాంకు అధికారులను జేసీ, పీవో అభినందించారు.



ఫొటో ప్రదర్శన తిలకిస్తున్న జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో

జాతీయ జెండాల పంపిణీ

ఐటీడీఏ కార్యాలయంలో పీవో అభిషేక్ అధికారులు, సిబ్బందికి బుధవారం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపైన జెండాను ఎగురవేసి, సంబంధిత ఫొటోలను అధికార పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇంటింటా మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వీఎస్.ప్రభాకర్, టీడబ్ల్యూ ఎస్డీసీ వీవీఎస్.శర్మ, టీడబ్ల్యూవో ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, ఐటీడీఏ ఏవో ఎం.హేమలత, డీఎల్‌పీవో పీఎస్.కుమార్ పాల్గొన్నారు.

పాముకాటుతో గిరిజనుడి మృతి

చింతపల్లి, ఆగస్టు 14: మండలంలోని బలపం పంచాయతీ దిగజనబ గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు పాము కాటుకు గురై మరణించాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పుట్టారి గోవిందరావు (35) మంగళవారం రాత్రి యథావిధిగా గృహంలో కుటుంబ సభ్యులతో పడుకున్నాడు. రాత్రి వేళ గృహం లోపలకు చొరబడిన పాము నిద్రిస్తున్న గోవిందరావు చేతిపై కాటు వేసింది. దీంతో బుధవారం ఉదయం బాధితుడ్ని కుటుంబ సభ్యులు కోరుకొండ పీహెచ్‌సీకి తీసుకు వచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం బాధితుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక చికిత్స చేయించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా, గోవిందరావు మార్గమధ్యంలో మృతి చెందాడు.

ఆశాజనకంగా నూతన వరి వంగడాల సాగు

చింతపల్లి, ఆగస్టు 14: మండలంలో నూతన వరి వంగడాల సాగు ఆశాజనకంగా ఉందని వ్యవసాయాధికారి శ్రీనివాసరావు చెప్పారు. కిన్నెర్ల గ్రామంలో గిరిజన రైతులు సాగుచేస్తున్న నూతన వంగడాల వరి పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులో భాగంగా అస్సాం రాష్ట్రంలో పండించే కిటాకీ జోహా వరి రకం వంగడాలను గత ఏడాది దిగుమతి చేసుకుని సాగు చేయించామన్నారు. దిగుబడులు బాగుండడంతో ఈ ఏడాది మరికొంత మంది రైతులతో సాగు చేయిస్తున్నామని చెప్పారు. ఈ పంట సాగు రెండో ఏడాది విజయవంతమైతే వచ్చే ఏడాది అధిక సంఖ్యలో రైతులకు విత్తనం అందజేస్తామని ఆయన తెలిపారు.

విప్లవ జ్యోతి అల్లూరి

... 7వ పేజీ తరువాయి

తేదీన గంటందొర, మల్లుదొర, ఎండుపడాల్, ఎర్రేసుతో పాటు 300 మంది గిరిజన విప్లవకారులతో కలిసి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశాడు. పోలీసులను తాళ్లతో బంధించి 11 తుపాకులు, 1390 తుపాకీ గుళ్లు, 14 బాయ్‌నెట్లు, 5 కత్తులను స్వాధీనం చేసుకున్నాడు. ఈ వివరాలను స్టేషన్ డైరీలో రాసి ఇంగ్లీష్‌లో సంతకం చేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి బయటకొస్తుండగా ఇద్దరు పోలీసులు ఎదురయ్యారు. వారి వద్దనున్న రెండు తుపాకులను కూడా లాక్కున్నారు. అలాగే పెదవలస, రంపుల ఘాట్ మీదుగా అడ్డదారిలో వెళ్లి మరుసటి రోజు 23వ తేదీన కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఏడు తుపాకులు, మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు సంఘటనలు విజయవంతం కావడంతో పోలీస్ స్టేషన్లపై దాడుల పరంపరను కొనసాగించారు. 24వ తేదీన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. 26 తుపాకులు, 2500కుపైగా తూటాలు ఎత్తుకెళ్లారు. అక్కడి జైలులో ఉన్న రంప పితూరిదారుడు మొట్టడం వీరయ్యదొరను పోలీసు నిర్బంధం నుంచి అల్లూరి విడిపించాడు. వరుసగా మూడు రోజుల పాటు మూడు స్టేషన్లపై అల్లూరి, అతని సేన దాడులు చేయడంతో బ్రిటీష్ అధికారుల్లో వణుకు పుట్టింది. అల్లూరి సాయుధ పోరాటాన్ని అణచివేసేందుకు సెప్టెంబరు 24న ప్రత్యేక పోలీసు బలగాలను, ఇద్దరు అధికారులను నియమించారు.

సమాచారం ఇచ్చి అడ్డతీగల స్టేషన్‌పై దాడి

సీతారామరాజు అత్యంత సాహసోపేతంగా అక్టోబరు 15న బ్రిటీష్ పాలకులకు ముందస్తు సమాచారం ఇచ్చి అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. బ్రిటీష్ ప్రభుత్వం స్టేషన్‌కి పూర్తి రక్షణ కల్పించినా అల్లూరి దళాన్ని అడ్డుకోలేకపోయింది. ఆయుధాలు దళానికి చిక్కకుండా దాచిపెట్టడం మినహా ఎటువంటి ప్రతిఘటన చేయలేదు. స్టేషన్‌పై దాడి చేసిన దళం దాదాపు ఐదు గంటల పాటు స్టేషన్‌లో ఉండి పోలీసులను బంధించారు. అలాగే అక్టోబరు 19న పట్టపగలే రంపచోడవరం పోలీస్ స్టేషన్ ముట్టడించారు. అక్కడ కూడా ముందుగా పోలీసులు ఆయుధాలు దాచిపెట్టడం వల్ల విప్లవకారులకు ఆయుధాలు లభించలేదు. అయితే అక్కడికి వచ్చిన భారీ సంఖ్యలో ప్రజలు సీతారామరాజు పట్ల తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. అల్లూరి సాహసాలను గ్రామాల్లో కథలు, కథలుగా ప్రజలు చెప్పుకునేవారు. అనంతరం పలు మార్లు తాను ఫలానా చోట ఉంటానని, కావాలంటే యుద్ధం చేయమని సీతారామరాజు బ్రిటీష్ పాలకులకు సవాల్ విసిరేవాడు.

అల్లూరి సేనకు భారీ ఎదురు దెబ్బ

అల్లూరి విప్లవానికి డిసెంబరు ఆరో తేదీన మొదటిసారిగా భారీ ఎదురుదెబ్బ తగిలింది. జాన్‌చార్సీ మరికొంత మంది అధికారుల నాయకత్వంలో ప్రభుత్వ సైన్యం, సీతారామరాజు సేన మధ్య పెద్దగడ్డపాలెం వరి పొలాల్లో పోరాటం జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో సీతారామరాజు అనుచరులు నలుగురు మృతి చెందారు. కొన్ని ఆయుధాలు సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకున్న విప్లవకారుల స్థావరాలపై ఆదే రాత్రి పోలీసు సైన్యం దాడి చేసింది. ఈ ఘటనలో మరో ఎనిమిది మంది విప్లవకారులు మరణించారు. అనంతరం నాలుగు నెలల పాటు విప్లవకారులు మౌనంగా ఉండిపోయారు. దీంతో రామరాజు చనిపోయాడని, విప్లవం ఆగిపోయిందని పుకార్లు వచ్చాయి. అయితే బ్రిటీష్ ప్రభుత్వానికి నమ్మకం కలగలేదు, రామరాజును పట్టిచ్చిన వారికి బహుమతిని ప్రకటించింది.

అన్నవరంలో ప్రత్యక్షం..

కొన్ని నెలలపాటు మౌనం పాటించిన అల్లూరి సీతారామరాజు 1923 ఏప్రిల్ 17న కొంత మంది అనుచరులతో కాకినాడ జిల్లా అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. స్థానిక స్టేషన్‌కి వెళ్లడంతో పోలీసులు లొంగిపోయారుగాని స్టేషన్‌లో ఆయుధాలులేకపోవడంతో తిరిగి వచ్చేశారు. కొండపైకి వెళ్లి సత్యనారాయణస్వామిని దర్శించుకున్నాడు. పత్రికా విలేకరులతో కూడా మాట్లాడాడు. అక్కడ నుంచి శంఖవరం వెళ్లాడు. స్థానిక ప్రజలు రామరాజుకు ఘన స్వాగతం పలికారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్.. రామరాజుని ఆదరించిన ప్రజలపై జరిమానా, అధిక పన్ను విధించాడు. దీంతో సాయంత్రం ఆరుగంటలకు శంఖవరంలో ఉంటాను, కలవడానికి రావాలని కలెక్టర్‌కి రామరాజు మిరపకాయ టపాసు పంపాడు. అయితే కలెక్టర్ రామరాజుని కలిసే సాహసం చేయలేదు.

ఉద్యమం అణచివేతకు రూథర్‌ఫర్డ్ నియామకం

సీతారామరాజు ఉద్యమాన్ని అణచివేసేందుకు 1924 ఏప్రిల్ 17న మన్యానికి కలెక్టర్‌గా రూథర్‌ఫర్డ్‌ను నియమించారు. ఆయనకు విప్లవాలను అణచివేయడంతో నిపుణుడిగా పేరుంది. ఆయన కృష్ణాదేవిపేటలో సభను ఏర్పాటుచేసి వారం రోజుల్లో విప్లవకారుల ఆచూకీ తెలియకపోతే ప్రజలను కాల్చివేస్తామని హెచ్చరించాడు. అప్పటికే ఆదివాసీలను బ్రిటీష్ సైన్యం రామరాజు ఆచూకీ తెలపాలని చిత్రహింసకు గురిచేసింది. కృష్ణాదేవిపేట సభ విషయాలను మంప మునసబు ద్వారా తెలుసుకున్న సీతారామరాజు మే 7న తాను ఉన్న ప్రాంతాన్ని పశువులకాపరిద్వారా పోలీసులకు చేరవేసి మంప చెరువులో స్నానంచేస్తూ పట్టుబడ్డాడు. ఎటువంటి విచారణ లేకుండా అల్లూరి సీతారామరాజును కొయ్యూరులోని చింతచెట్టుకు కట్టి మేజర్ గుడాల్ కాల్చిచంపాడు. 8వ తేదీన రాజు మృతదేహాన్ని ఫొటో తీయించి కృష్ణాదేవిపేటలో దహనం చేశారు.

రంగురాళ్ల తవ్వకాలపై విచారణ

... 7వ పేజీ తరువాయి

చేస్తున్నామన్నారు. పోలీసులు తవ్వకాలపై విచారణ ప్రారంభించారన్నారు. క్వారీలో తవ్వకాలు సాగించిన వ్యక్తులు, వ్యాపారులను పట్టుకుని కేసులు పెడతామన్నారు. సమ్మగిరి పరిసర గ్రామాల ప్రజలు క్వారీలో తవ్వకాలు నిర్వహించరాదని, తవ్వకాల వల్ల ప్రాణాలకు ప్రమాదం కలుగుతుందని అవగాహన కల్పించామన్నారు. మూసివేసిన క్వారీలో మళ్లీ తవ్వకాలు నిర్వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గొందిపాకలు సర్పంచ్ సాగిన వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉల్లి సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో కృష్ణారావు, ఎఫ్‌బీవో గోపి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రమేశ్‌నాయుడు



పాడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌నాయుడు బుధవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని లోకేశ్ చెప్పినట్టు ఆయన తెలిపారు.

గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలి

పాడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబిడి శ్యామ్‌సుందర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం మెయిల్ ద్వారా విన్నవించినట్టు చెప్పారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు ఇస్తుండగా... ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇస్తున్నారని వివరించినట్టు చెప్పారు. మంత్రి లోకేశ్ సానుకూల నిర్ణయంతో ఏజెన్సీ వ్యాప్తంగా లక్ష మంది గిరిజన విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మండల సర్వసభ్య సమావేశం

కొయ్యూరు, ఆగస్టు 14: మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. వైసీపీకి చెందిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా క్యాంపు రాజకీయాల కారణంగా హాజరు కాలేదు. నిర్దేశిత సమయానికి అధికారులు వచ్చినా, ప్రజా ప్రతినిధులు తగిన సంఖ్యలో రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశామని, తదుపరి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.

పనసపల్లిలో శిశువు మృతి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 14: మండలంలోని జీకే వీధి పంచాయతీ పనసపల్లి గ్రామంలో అనారోగ్యంతో శిశువు మృతి చెందింది. గ్రామానికి చెందిన లోసరి జాను, చిన్నారి దంపతులకు 15 రోజుల క్రితం మగ శిశువు జన్మించాడు. మంగళవారం ఉదయం శిశువు అస్వస్థతకు గురికావడంతో చింతపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స చేసిన అనంతరం ఇంటికి తీసుకువెళ్లగా, రాత్రి 10 గంటల సమయంలో శిశువు మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు.

వారపు సంతకు వర్షం దెబ్బ

అనంతగిరి, ఆగస్టు 14: మండలంలోని కాశీపట్నం, డముకు వారపు సంతలకు వర్షం దెబ్బ తగిలింది. 12 గంటల నుంచి ఏకధాటిగా వర్షం పడడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంతలో విక్రయానికి తీసుకువచ్చిన అటవీ ఉత్పత్తులు అమ్ముడుకాకపోవడంతో గిరిజనులు నిరాశతో వెనుదిరిగారు.

అనాథ విద్యార్థులకు దుస్తుల వితరణ

జి.మాడుగుల, ఆగస్టు 14: మండలంలోని కొత్తూరు బాలురు-2 ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న అనాథ విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుడు మోరి మోహన్ దుస్తులు పంపిణీ చేసి ఉదారత చాటుకున్నారు. పాఠశాలలోని 20 మంది పేద విద్యార్థులకు సొంత నగదు వెచ్చించి దుస్తులు అందజేశారు.

కాశీపట్నంలో వైద్య శిబిరం

అనంతగిరి, ఆగస్టు 14: మండలంలోని కాశీపట్నం వారపు సంతలో వైఎస్.జయమ్మ ట్రస్టు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సంతకు వచ్చిన గిరిజనులకు క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జ్ఞానేశ్వరి, జాహ్నవి, గౌతమ్, మణికంఠ, కోఆర్డినేటర్ కనకేశ్వరరావు, ప్రవీణ్, ఎంపీహెచ్ఈవో నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్రీడా పోటీలు

చింతపల్లి, ఆగస్టు 14: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మండల స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శన, స్వాతంత్ర్య పోరాట యోధుల ఫ్యాషన్ షో, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ప్రిన్సిపాల్ విజయభారతి చెప్పారు.

గసభలో...

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ పాంగి సునీత, మాజీ సర్పంచ్ సురేశ్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గురువారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని బహుమతులు అందిస్తామని సర్పంచ్ సునీత తెలిపారు.

అరకు ఉపాధ్యాయురాలు మృతి

డుంబ్రిగుడ, ఆగస్టు 14: మండలంలో అరకు పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శెట్టి రమణమ్మ మంగళవారం రాత్రి మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమణమ్మ, పరిస్థితి విషమంగా మారడంతో బుధవారం మృతి చెందారు. దీంతో ఆమె స్వగ్రామం హుకుంపేట మండలంలోని అడ్డుమండ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రమణమ్మ మృతిపై ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

సహచరుల వేధింపులపై సర్వేయర్ ఫిర్యాదు

కొయ్యూరు, ఆగస్టు 14: సహచర ఉద్యోగులు మానసికంగా వేధిస్తున్నారని డౌనూరు సచివాలయ సర్వేయర్ సౌందర్య బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సచివాలయ కార్యదర్శి, మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వరిస్తున్నా ఆబ్‌సెంట్ మార్క్ వేస్తూ ఇబ్బంది పెడుతున్నారని, కనీస గౌరవం ఇవ్వడం లేదని ఫిర్యాదులో ఆమె ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ తిరుమలరావు చెప్పారు.

మద్యం, మాంసం విక్రయిస్తే చర్యలు

హుకుంపేట, ఆగస్టు 14: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం మద్యం, మాంసం విక్రయాలను నిషేధించామని సీఐ సన్యాసినాయుడు తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎటువంటి ఘర్షణలు లేకుండా వేడుకలు జరుపుకోవాలని ఆయన కోరారు.

క్రైం... crime news

లంకెలపాలెంలో తప్పిన ప్రమాదం

» ట్యాంకర్‌ను ఢీకొన్న ట్రాలర్ లారీ



ప్రమాదంలో దెబ్బ తిన్న లారీని క్రేన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం

లంకెలపాలెం, ఆగస్టు 14 : జాతీయ రహదారి లంకెలపాలెం ప్రధాన కూడలిలో బుధవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న ట్యాంకర్ లారీని ట్రాలర్ లారీ వేగంగా వచ్చి ఢీకొంది.ఈ ఘటనలో ట్రాలర్ లారీ క్యాబిన్ నుజ్జయ్యింది. సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖ నుంచి అనకాపల్లి వెపునకు వెళుతున్న ట్యాంకర్ లారీ సరిగ్గా లంకెలపాలెం కూడలికి వచ్చేసరికి ట్రాఫిక్ సిగ్నల్ పడింది. అదే సమయంలో ఐరన్ బుల్లెట్లతో వెనుక వస్తున్న ట్రాలర్ లారీ వేగం రావడంతో అదుపు తప్పి సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న ట్యాంకర్ లారీని బలంగా ఢీకొంది. దీంతో ట్రాలర్ లారీ క్యాబిన్ పూర్తి దెబ్బంది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. అయితే ట్యాంకర్ ముందు ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ కారణంగా సుమారు గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో అంతా తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాలను అక్కడి నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నాలుగు తులాల బంగారం చోరీపై ఫిర్యాదు

రాంబిల్లి, ఆగస్టు 14 : మండలంలోని ఓ గ్రామంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు బుధవారం ఫిర్యాదు అందిందని రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. పంచదార్ల గ్రామానికి చెందిన గుర్రం అరుణ కుమారి ఇటీవల తన పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం తిరిగి వచ్చి చూసేసరికి తన ఇంట్లోని బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో తమకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

నిన్న జనసేనలో.. నేడు మళ్లీ వైసీపీలో..!

» వైస్ ఎంపీపీ ఉమా దంపతుల రాజకీయంపై చర్చ



తాడేపల్లిలో జగన్‌తో వైస్ ఎంపీపీ ఉమా, గణేశ్ కలిసి ఉన్న చిత్రం

ఎలమంచిలి, ఆగస్టు 14 : ఎలమంచిలి వైస్ ఎంపీపీ శిలపరశెట్టి ఉమా, గణేశ్ దంపతులు తాజాగా మళ్లీ వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్టు ఫొటో బయటకు రావడంతో మండల వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి చెందిన వీరు ఈ నెల తొమ్మిదో తేదీన మంగళగిరిలో ఎలమంచిలి ఎమ్మెల్యే సమక్షంలో జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సుందరపు విజయకుమార్ సాదరంగా ఆహ్వానించారు. కానీ ఆరు రోజులు గడవకముందే బుధవారం తాడేపల్లిలో వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎలమంచిలి నియోజకవర్గ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబుతో పాటు ఉమా, గణేశ్ దంపతులు ఇద్దరూ జగన్‌ను కలిసి ఉన్న ఫొటో వైరల్ అవుతోంది. ఇది చూసిన స్థానికులు నివ్వెరపోతున్నారు.

హస్తినలో వేడుకలకు అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ



సబ్బవరం, ఆగస్టు 14 : ఢిల్లీలో గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడకల్లో పాల్గొనేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున మండలంలోని మలునాయుడుపాలెం-3 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రావిపల్లి రమణమ్మ ఎంపికైనట్టు సీడీపీవో లలితకుమారి తెలిపారు. ప్రధాని మోదీ చేతులమీదుగా రమణమ్మ జ్ఞాపికను అందుకోనున్నారని ఆమె వివరించారు.

గిరిజన గ్రామం మన్యంపాలెంలో వైద్య శిబిరం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, ఆగస్టు 14 : మండలంలోని ఏకైక గిరిజన గ్రామం మన్యంపాలెంలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం చట్టాలపై అక్కడివారికి అవగాహన కల్పించారు. వైద్య బృందం పలువురికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులతో పాటు వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 14: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వయా దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు ఒకవైపు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. మధురై - ముజాఫర్‌పూర్; 06114 నంబరు గల రైలు ఈనెల 18న (ఆదివారం) రాత్రి 7.05 గంటలకు మధురైలో బయలుదేరి మర్నాడు రాత్రి 9.40కు దువ్వాడ, బుధవారం తెల్లవారుజాము 2.45 గంటలకు ముజాఫర్‌పూర్ చేరుతుంది. కొచువెలి-పాట్నా రైలు ఈనెల 18న (ఆదివారం) రాత్రి 7.00 గంటలకు కొచువెలిలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, బుధవారం ఉదయం 5.45 గంటలకు పాట్నా చేరుతుంది. తిరునెల్వేలి-పాట్నా రైలు ఈ నెల 17న (శనివారం) రాత్రి 9.45 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మంగళవారం ఉదయం 5.45 గంటలకు పాట్నా చేరుతుంది. చెన్నై సెంట్రల్-పాట్నా 06003 నంబరు గల రైలు ఈనెల 16న (శుక్రవారం) ఉదయం 10.45 గంటలకు చెన్నైలో బయలుదేరి రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, ఆదివారం ఉదయం 5.45 గంటలకు పాట్నా చేరుతుంది.

ప్రత్యేక రైళ్లకు ఎలమంచిలిలో హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, తిరుపతి, బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లకు ఎలమంచిలి స్టేషన్‌లో అదనపు హాల్ట్ కల్పించినట్టు తెలిపారు. ఎలమంచిలిలో హాల్ట్ కల్పించిన వాటిలో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), విశాఖ-ఎస్ఎంవీ బెంగళూరు ప్రత్యేక రైలు (08543), ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖ ప్రత్యేక రైలు (08544) ఉన్నాయని పేర్కొన్నారు.

గరీబ్‌రథ్‌కు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖ, సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు అదనంగా రెండు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు జత చేశారు. సికింద్రాబాద్ నుంచి విశాఖ 12740 నంబరు గల ఈ రైలు ఈనెల 14 (బుధవారం) నుంచి 19వ తేదీ వరకు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే 12739 నంబరు గల రైలుకు ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	490
విజయనగరం	494
శ్రీకాకుళం	494

మహనీయుల స్ఫూర్తితో ముందడుగు

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపు

» అధికారులు, విద్యార్థులతో కలిసి భారీగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



జెండా చేతబట్టి ముందుకు సాగుతున్న కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: మహనీయుల బాటలో పయనిస్తూ భావితరాలకు స్ఫూర్తిగా నిలుద్దామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామన్నారు. వారి త్యాగాలను, సాహసాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం అంతా అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ నెహ్రూచౌక్ మీదుగా వివిధ ప్రాంతాల గుండా సాగి తిరిగి స్టేడియానికి చేరుకుంది. అధికారులు, విద్యార్థులు, పట్టణవాసులు నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో అడిషినల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎఫ్‌వో లక్ష్మణరావు, డీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిణి మంజులావాణి, అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, సీఐలు శంకరరావు, పైడపునాయుడు, వినోద్ బాబు, వివిధ విభాగాధిపతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భారీ ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కుల్ని కాపాడుకుందాం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

కొత్తూరు, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ నాడు కులమతాలకు అతీతంగా ప్రజలందరూ బ్రిటీష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టారని, నేడు అదే స్ఫూర్తితో మన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్ కార్మికుల పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకరరావు, కోటేశ్వరరావు, కార్యదర్శులు గోసేరు వరలక్ష్మి, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, రైతు సంఘం నాయకులు నాయుడు బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, వెంకటేష్, అప్పారావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్సిల్ ముల్లుపై జాతీయ జెండా



పెన్సిల్ ముల్లుపై చెక్కిన జాతీయ జెండా, పక్కన సంజయ్‌దీపక్ (ఇన్‌సెట్)

పాయకరావుపేట, ఆగస్టు 14 : పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు మరో అద్భుత కళాఖండాన్ని సృష్టించాడు. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కుందూరు సంజయ్‌దీపక్ తన కళానైపుణ్యంతో పెన్సిల్ ముల్లుతో ఎన్నో అద్భుతాలు సృష్టించాడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం పెన్సిల్ ముల్లుపై సెంటీమీటరు సైజులో జాతీయ జెండాను తయారుచేసి పలువురి దృష్టిని ఆకర్షించాడు.

కోటవురట్ల మండలంలో కుండపోత



వర్షం నీటితో నిండిన ప్రధాన రహదారి

కోటవురట్ల, ఆగస్టు 14 : వాతావరణంలో మార్పుల కారణంగా బుధవారం మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమైంది. అనంతరం సుమారు గంటన్నర పాటు కుండపోత వర్షం పడింది. దీంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

» కశింకోట మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగ లక్ష్మి

కశింకోట, ఆగస్టు 14 : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కలగ లక్ష్మి అన్నారు. బుధవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎటువంటి తీర్మానాలు చేయలేమన్నారు. గ్రామాల్లో డయేరియా, డెంగ్యూ లతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. భూ సర్వే చేసినప్పుడు జగన్ ఫొటో ఉండకుండా ఉండాలన్నారు. వాటిపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఆ రాళ్లను తొలగిస్తామ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడు వివరించారు. మండలంలో నీటి సమస్య పరిష్కారానికి ఇంటింటి కుళాయి పథకం కింద ఎనిమిది ట్యాంకులు నిర్మించాలని గతంలో తీర్మానం చేశామన్నారు. నిధులు మంజూరైన వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేషుబాబు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

» ప్రారంభించిన ఎంపీ సీఎం రమేష్



బైక్ ర్యాలీలో సీఎం రమేష్, పీలా గోవింద, బుద్ద నాగజగదీష్ తదితరులు

కొత్తూరు, ఆగస్టు 14 : హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ యువమోర్చ బుధవారం అనకాపల్లిలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఎంపీ సీఎం రమేష్ ప్రారంభించారు. నెహ్రూచౌక్ కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సుంకరమెట్ట కూడలి వరకు ఉత్సాహంగా సాగింది. తొలుత డాక్టర్ అంబేడ్కర్, బుద్ధుని విగ్రహాలకు ఎంపీ సీఎం రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బుల్లెట్ నడుపుతూ బైకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు కర్రి రామకృష్ణ, మారిశెట్టి భాస్కరరావు, కొణతాల అప్పలరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, యలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు కోట్ని బాలాజీ, మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆమెను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని, అనకాపల్లిలో ఏపీయూడబ్ల్యూజే భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావు, జిల్లా సహాయ కార్యదర్శి యల్లపు రమణాజీ, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి చాగంటి అవతారం తదితరులు కోరారు.

'పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జగన్నాథరావు

కొత్తూరు, ఆగస్టు 14 : పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు కోరారు. పట్టణంలోని నర్సింగరావుపేటలో గల ఏపీటీఎఫ్ భవనంలో బుధవారం ఏర్పాటైన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. 11వ పీఆర్సీ బకాయిలు, డీఆర్ ఎరియర్స్ చెల్లించాలని, ఆరోగ్యకార్డుల ద్వారా నగదు రహిత వైద్యసేవల సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ, మండల శాఖ అధ్యక్షుడు కె.రామారావు మాట్లాడుతూ అనకాపల్లిలో సంఘ భవనం నిర్మాణానికి ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. జిల్లా ఖజానా అధికారిణి ఎల్.సుభాషిణి మాట్లాడుతూ పింఛనర్లకు సమస్యలు ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఉప ఖజానా (పడమర) అధికారి ఎం.బిజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.సోమేశ్వరరావు, ట్రెజరర్ కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత లేని బంగారంపై అప్రమత్తంగా ఉండాలి'



సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14: శ్రావణమాసం ముసుగులో జిల్లాలో స్వచ్ఛత లేనిబంగారు ఆభరణాల అమ్మకాలు పలుచోట్ల జరుగుతున్నాయని కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ ఆరోపించారు. బుధవారం ఇక్కడ జరిగిన మహిళా సదస్సులో మాట్లాడారు. కొన్ని బంగారం దుకాణాలు ప్రకటించే రాయితీలు, లక్కీ డ్రా కూపన్లు వంటి ఆకర్షణీయమైన ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో గౌరీ గ్రంథాలయం మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, ఉపాధ్యక్షులు కర్రి గంగాధర్, మళ్ల సూరిబాబు, దాడి ఈశ్వరరావు, రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావంతో ఎండిపోతున్న వరి ఆకుమడులు



దిబ్బిడిలో ఎండిపోతున్న వరి ఆకుమడికి నీరు అందిస్తున్న మహిళా రైతు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 14: మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వరి ఆకమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నారుమడులను రక్షించుకునే క్రమంలో రైతులు అనేక ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు అనుసరిస్తున్నారు. మండలంలో మూడు వరాలుగా వరుణుడి జాడ కనిపించడం లేదు. ఎర్రవాయి ప్రాంతంలో పది గ్రామాల్లోని ఆకుమడులు దెబ్బతింటున్నాయి. ఎండలు వేసవిని తలపిస్తుండటంతో ఎండిపోతున్న ఆకుమడులను రక్షించుకునేందుకు దూరంలో ఉన్న వ్యవసాయ బావులు, బోర్ల నుంచి ప్లాస్టిక్ బొడ్డులు ద్వారా నీటి తడులు అందిస్తున్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



విద్యార్థిని అభినందిస్తున్న న్యాయమూర్తి

నర్సీపట్నం, ఆగస్టు 14: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'వ్యక్తులు, సమాజంపై మాదక ద్రవ్యాలు ప్రభావం' అంశంపైవ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీలలో విజేతలను సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ అభినందించారు. వక్తృత్వ పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న నరేష్ ప్రథమ స్థానం, బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విజయ్ ద్వితీయ స్థానం సాధించారు. వ్యాస రచన పోటీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జి జానకిబాల రాజేశ్వరి మొదటి స్థానం, శ్రీవిద్యా కళాశాల విద్యార్థిని ఎస్.ప్రేమవర్షిత ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు కోర్టు సముదాయంలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో న్యాయమూర్తి బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాజు, ఎంఈవో నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.


నిండుకుండలా తాండవ



కళకళలాడుతున్న తాండవ

నాతవరం, ఆగస్టు 14: తాండవ రిజర్వాయర్ నిండుకుండలా దర్శనమిస్తూ కళకళలాడుతుండటంతో తాండవ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం తాండవలో 376 అడుగుల నీటినిల్వలు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తాండవలోకి ఇన్‌ఫ్లో ద్వారా 400 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేల ఎకరాలకు సాగునీరు అందించే తాండవ రిజర్వాయర్ నీటిని ఆగస్టు 19న విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాలు మరింత ఎక్కువైతే తాండవలో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు చేరే అవకాశం ఉంది.

'ఒకే విత్తనం.. మూడు మొలకలు' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన కవులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 14 : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ కవి సమ్మేళనాన్ని బుధవారం నిర్వహించారు. అనకాపల్లి సాహితీమిత్రులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లక్కోజు రాజా గణేష్ రచించిన 'ఒకే విత్తనం... మూడు మొలకలు' కథా సంపుటి పుస్తకాన్ని డాక్టర్ చక్రపాణి ఆవిష్కరించారు. ఈ పుస్తకంలోని కథలను సమీక్షించారు. రచయిత రాజా గణేష్‌ను సత్కరించారు. జీఎస్‌కే సాయిబాబా కథల పుస్తకం, తాతమ్మ కథలు పుస్తకాన్ని మాధవీసనారా, జీఎల్ఎన్ శాస్త్రి పుస్తక స్పర్శ కవితలను రంగబాబు పరిచయం చేశారు. సంస్థ కన్వీనర్ గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కర్రి మల్లేశ్వరి, గంపా శ్రీదేవి, డీఎల్ నారాయణ, షేక్‌బాషా, జీఎల్ఎన్ శాస్త్రి, కోరాడ అప్పలరాజు, బల్లా నాగభూషణం, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన దోసూరు ఎంపీటీసీ పద్మజ

అచ్యుతాపురం, ఆగస్టు 14: వైసీపీకి చెందిన దోసూరు గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు రాజాన పద్మజ, ఆమె భర్త అప్పారావు బుధవారం జనసేనలో చేరారు. అచ్యుతాపురంలో వీరికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, లాలం చందు, ద్వారపురెడ్డి బాపూజీ, చిన్ని పంతులు, పవన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.